


"ఈ పెళ్లి ఎలా జరుగుతుందో చూస్తా!" కోపంగా అరిచాడు నాగభూషణం (సరిగ్గానే పోల్చుకున్నారు! ఈ కథకి అతనే విలన్)

"మీరు ఒప్పుకుంటే గ్రాండ్‌గా లేకపోతే సింపుల్‌గా" నెయిల్ పాలిష్ మూత తీస్తూ

# ఒక దెబ్బ-రెండు పిట్టలు

## మోర్తల ప్రభాకర్ రెడ్డి

తాపీగా అంది కవిత.

"ఈ పెళ్లి జరగడానికి వీల్లేదు!" మళ్లీ అరిచాడు భూషణం.

"మా పెళ్లి ఆపడం ఎవ్వరి తరం కాదు. నేనిప్పుడు మేజర్‌ని" చిటికెన వేలి గోరుకు రంగు పూస్తూ అంది కవిత.

''రాక్షసి! నాకు తెలియకుండా సైన్యంలో కూడా చేరావా?'' పళ్లు కొరుకుతూ అన్నాడు భూషణం.

''అబ్బా! మీది మరీ చోద్యం- అమ్మాయి గారికి మైనారిటీ తీరిందని దాని ఉద్దేశం.'' చిరాగ్గా అన్నాడు చెంచా (అతను భూషణానికి ఆల్ ఇన్ ఒన్)

గోడకి గబ్బిలంలా వేలాడుతున్న స్త్రీ ఫోటో దగ్గరకి వెళ్లి ''చూశావా పొట్టేశ్వరి... అమ్మాయి నా మాట వినకుండా ఎలా...'' గద్గద స్వరంతో మరేదో చెప్పబోతున్న భూషణానికి అడ్డుపడుతూ '' ఏహే! ఆపండి ఎదవగోల ! అసలు మీ సుత్తి భరించలేకే ఆవిడ అంత ఎర్లీగా పోయింది.... చచ్చి నరకంలో అయినా సుఖంగా వున్న అమ్మగారిని ఇంకా ఎందుకు క్షోభ పెడతారు. బతికున్న మీరే ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించాలి గానీ.... చెంచా కసురుకునే సరికి నాగ భూషణం సంధి ప్రేలాపన అంతటితో ముగించి ఓ క్షణం బుర్ర గోక్కుని రూటు మార్చి చిన్నప్పటి నుంచి నీకు తల్లిదండ్రి, గురువూ, ఫ్రెండు అన్నీ నేనే అయి పెంచాను అని అనగానే అందుకే కాస్త ఓవర్ అయింది... ఏదో ఒకటి అయి పెంచుంటే ఈ ప్రాబ్లమ్ వచ్చి ఉండేది కాదు. కవిత వ్యంగ్యంగా అంది.

''ఎంత పొగరే నీకు బుద్ధిగా చదువుకుంటావని కాలేజీకి పంపిస్తే చదవడం మానేసి ప్రేమా...గీమా... అంటూ ఆ వెధవనెవడ్నో...'' భూషణానికి తన అక్కసంతా వెళ్లగక్కే అవకాశం ఇవ్వకుండా కవితా '' యూ ఆర్ రాంగ్... నేను ప్రేమించిన ధూమేష్ కాలేజీ స్టూడెంట్ కాదు. అతనెవరో తెలుసా... ఆటోడ్రైవర్!'' ధూమేష్ ఏదో బిల్ గేట్స్ అన్నంతగర్వంగా చెప్పింది కవిత.

ఛీ...పోయి పోయి ఓ ఆటోడ్రైవర్‌నా నువ్వు ప్రేమించింది... నీకేం రోగం వచ్చింది? నీకు ఇంకెవడూ దొరకలేదా?'' ఈసడింపుగా అన్నాడు భూషణం

''ఏమో వెదికితే దొరికే వారేమో.... ఓపిక లేక వెదకలేదు. అయినా నేను పన్నెండో చూపులోనే ధూమేష్‌ని ప్రేమించాను. ఒక కోటీశ్వరుడి కూతురిని అయిన నేను ఓ ఆటో డ్రైవర్‌ని ప్రేమించడం నా విధి... కనీస ధర్మం అనుకొని ఫిక్స్ అయిపోయాను'' అంది కవిత శూన్యంలోకి చూస్తూ.

''మొదటి చూపు గురించి విన్నాం... ఈ పన్నెండో చూపేంటి తల్లి?'' చెంచా గుడ్లు మిటకరిస్తూ తన అజ్ఞానాన్ని బయట పెట్టుకున్నాడు.

కవిత ఓ క్షణం చెంచా వైపు జాలిగా, దయగా ఇంకా రెండు మూడురకాలుగా చూస్తూ...''ఓ అదా... అంతకు ముందు పదకొండు సార్లు నేను ధూమేష్‌ను చూడాలని ఎంతగానో ప్రయత్నించాను. కుదరలేదు. అప్పట్లో అతనో జుట్టుపోలిగాడిలా ఉండేవాడు. పన్నెండోసారి మాత్రమే అతని మోహం చూడగలిగాను. ఎంచేతంటే అప్పటికి అతనికి తిరుపతి మొక్కు తీరింది!'' అజ్ఞానులిద్దరిలో జ్ఞానజ్యోతిని వెలిగించింది కవిత.

''నువ్వా దరిద్రుడిని పెళ్లి చేసుకుంటే ఏం సుఖపడతావమ్మా? ఎక్కడుంటారు? ఏం తింటారు? నువ్వా కష్టాలు తట్టుకోలేవమ్మా!'' ఆఖరి ప్రయత్నం చేసాడు భూషణం.

కవిత వేదాంతిలా నవ్వి ''ఇలాంటి రోజు వస్తుందని తెలిసే ఖాళీ సమయాల్లో మిషన్ తొక్కడం... బుట్టలు...తట్టలు అల్లడం...వంటపని, పాచిపని నేర్చుకున్నాను. హృదయం లేని ఈ సమాజానికి దూరంగా వెళ్లి పోవాలని నిర్ణయించుకొన్నాం. ప్రస్తుతం ధూమేష్ దండకారణ్యంలో ఓ పాక ఏర్పాటు చేయడానికి వెళ్లాడు. త్వరలో మా కష్టార్జితంతో రెండు గేదెలూ... కోళ్లూ గట్రా కొనుక్కుంటాం.'' ఎంతో ఉద్వేగంతో అంది కవిత.

భూషణం అవాక్కయ్యాడు! చెంచా మాత్రం ఉండబట్టలేక '' ఆ చిట్టడవిలో పాలెవరికి అమ్ముతారు? నీ వంటా వార్పూ ఎవరికి అవసరం?'' అన్నాడు.

కవితా మరోసారి చెంచాని జాలిగా చూసి '' ఓ... అదా... అడవిలో ఉండే నక్సలైట్లు.... వాళ్లని పట్టుకోవడానికి తిరిగే పోలీసులూ ఉంటారుగా.... వాళ్లు చాలు... మీరే చూస్తారుగా... ఏనాటికైనా మేమూ కోటీశ్వరులం అవుతాము.... అప్పుడు మీరు ధూమేష్‌ని నా అల్లుడు.... నా అల్లుడు అంటూ గర్వంగా చెప్పుకుంటారు...'' మెరిసే కళ్లతో అంది.

**''ఓ అదా... అంతకు ముందు పదకొండు సార్లు నేను ధూమేష్‌ను చూడాలని ఎంతగానో ప్రయత్నించాను. కుదరలేదు. అప్పట్లో అతనో జుట్టుపోలిగాడిలా ఉండేవాడు. పన్నెండోసారి మాత్రమే అతని మోహం చూడగలిగాను. ఎంచేతంటే అప్పటికి అతనికి తిరుపతి మొక్కు తీరింది!''**

అన్ని వందల సంవత్సరాలు బ్రతుకుతాననే నమ్మకం నాకు లేదమ్మ... కాబట్టి ఆరోజు చూస్తాననే భ్రమలేవి నాకు లేవు తల్లీ.... కానీ ఇప్పుడు జరుగుతున్నది చూస్తుంటే మాత్రం నా ఆయుష్షు రోజుల్లోనే ఉన్నట్టుంది.... సరే ఆ ధూమేష్‌ను ఓసారి కలవాలి రమ్మను...'' భూషణం అహం దిగమింగుకుని అన్నాడు.

''ఎందుకు? అతన్ని అవమానించి నా నుంచి దూరం చేయడానికా?'' కవిత అనుమానంగా అంది.

వచ్చే ఏడుపుని దిగమింగుకుని ''అబ్బే అందుకు కాదమ్మా! వాడొస్తే వాడి ఎడమ కాలి చెప్పుతో నన్ను నేను చచ్చేదాకా కొట్టుకుందామని... అప్పటికీ చావకపోతే వాడి కుడికాలి చెప్పుతో కూడా వాడితోనే కొట్టించుకొని చద్దామని.... లేకపోతే ఏమిటమ్మా! నీ అనుమానం.... పెళ్లికి ముందు ఒక్కసారి చూసే భాగ్యం కూడా నాకు లేదా?'' దీనంగా అడిగాడు భూషణం.

కవిత రెండు నిమిషాలు సెల్‌ఫోన్‌లో మాట్లాడి ''రేపు ఆదివారం నాలుగింటికి వస్తానన్నాడు'' అంది వరం ఇస్తున్నట్లు.

''ఏం అయ్యగారికి ఆదివారం కూడా తీరదా?''అక్కసంతా వెళ్లకక్కాడు భూషణం.

ఆదివారం మధ్యాహ్నం మూడింటి వరకూ ఓ మటన్‌షాపులో ఖైమా కొట్టే పనిలో చేరాడు.... నా కోసం... ఇప్పటికైనా అర్థమైందా? డాడీ నన్ను సుఖపెట్టడానికి నా ధూమేష్ ఎంత కష్టపడుతున్నాడో ఉద్వేగంగా అంది కవిత.

'వేరే' కారణాల వల్ల భూషణం... చెంచా కళ్లు తుడుచుకున్నారు. ముక్కు కూడా చీదాలనిపించినా ఎలాగో తమాయించుకొన్నారు.

***

ఆ 'ఆదివారం' చచ్చినట్లు వచ్చింది.... ధూమేష్ సరిగ్గా నాలుగింటికి వచ్చాడు. ఫోటో నెగిటివ్‌లా ఉన్నాడు... ఎవరైనా అతని మీద ఉమ్మేయడానికి కూడా కనీసం ఐదువేలు ఇస్తే కానీ కుదర్దు అనేంత ఘోరంగా... ఛండాలంగా ఉంది ఆకారం.

కవితకి అసలు ధూమేష్ ఎలా నచ్చాడో కాస్త కూడా బోధపడలేదు. ప్రేమ అన్నది గుడ్డిదని విన్నాడు కానీ... కొందరి ప్రేమ ఫిజికల్లే కాక మెంటల్లీ కూడా కాబోలు...

ధూమేష్ వస్తూనే కంపూ బ్రాండ్ బీడీ వెలిగించి భూషణం మొహానికి 'ధూపం' వేస్తూ ''కవ్వి ... ఏం చేస్తోంది?'' అన్నాడు. భూషణం ఇరవై ఆరుసార్లు దగ్గి 'మేడ పైన ఉంది' అని ఆ మాత్రానికే ఆస్మా పేషెంట్‌లాగా ఆయసపడసాగాడు.

తను మౌనంగా ఉండడం బాగోదనుకుని 'స్నానం చేస్తోంది...' అని వివరంగా కవిత ప్రోగ్రాం గురించి చెప్పాడు చెంచా...

'వారెవ్వా.... అయితే మంచి టైంకి వచ్చానన్నమాట...' అంటూ ఎవ్వరి పర్మిషన్ లేకుండానే హుషారుగా ఈల వేస్తూ మేడ మెట్లు ఎక్కబోయాడు.

'' ఆగు ఏంటా చొరవ... మంచి మర్యాదా తెలీదా! అమ్మాయి వచ్చే దాకా ఆగలేవా?'' అంటూ కోపంగా అన్నాడు భూషణం.

''తేరితో...క్యాబే ఛుడ్డీ... నెత్తి గిట్ట తిరుగుతోందా...'' అంటూ పిడికిలి ఎత్తాడు ధూమేష్....

ఒక్క క్షణం ఆలస్యం అయితే నాగ భూషణం మొహం పచ్చడయ్యేది. ఇంతలో 'ధూమూ! ... ఆగు' అని కవిత అరవడంతో భూషణం మొహం మరింత అసహ్యంగా కాకుండా ఆగిపోయింది. ఆ రకంగా కవిత తండ్రి ఋణం చాలావరకూ తీర్చుకుంది.


ధూమేష్ స్లోగా పరిగెత్తి, స్పీడ్‌గా కవితని వాటేసుకుని, బ్లూఫిలిం ట్రెయిలర్ లాంటిది మొదలెట్టాడు.

ధూమేష్‌ని అతని ప్రవర్తననీ చూశాక భూషణం, చచ్చినా కవిత పెళ్లి ధూమేష్‌తో జరగకూడదనే నిర్ణయానికొచ్చాడు. అందుకే అతనితో మాట్లాడే ఉద్దేశ్యం కూడా విరమించుకున్నాడు.

భూషణం విలనే... అయితే ఫ్యాక్షనిస్ట్ బ్యాక్ గ్రౌండ్ లేదు. తెల్లలుంగీలూ... టాటా సుమోల టైప్ షోపుటప్ అతనికి లేదు.

చెంచా సలహా మేర ఆ సిటీకే ఫేమస్ దాదా అయిన కుంటి పాండుని ఆశ్రయించాడు. తన కాళ్ళ వైపు పరీక్షగా చూస్తున్న చెంచా వీపుమీద బలంగా మోది ''ఏందిరా.. ఖైటు ఆ బోర్లు చూసి నా కాళ్ళు గిట్ల కుంటి అనుకున్నావ్ నే... అరే బేకూఫ్, నాకాపేరు నా దుష్మన్ల కాళ్ళు ఇం గొట్టినందుకు వచ్చింది బిడ్డా... సమజ్ అయ్యిందా! ' అంటూ ఓపెద్ద ఇనుప సుత్తి, భుజం మీంచి దించ కూ అన్నాడు. కొద్ది తేడాతో అది 'చెంచా' ఎడమ కాలని మిస్ అయింది... లేకపోతే కుంటి పాండు 'పనితనం' తాలూకు శ్యాంపిల్ చెంచా స్వయంగా చూసేవాడే. ధూమేష్ వివరాలు ప్లస్ ఇరవైవేలు ఎడ్వాన్స్ తీసుకుని రెండు రోజుల్లో పని పూర్తవుతుందని చెప్పాడు కుంటి పాండు.

ఇరవై రోజులైనా పాండు జాడలేదు. కవిత పెళ్ళికి ముహూర్తం సమీపిస్తోంది. పాండు ఇంటికి ఎప్పుడు వెళ్ళినా తాళం వేసి వుండేది. భూషణానికి ఆదుర్దా ఎక్కువవసాగింది.




ఓరోజు భూషణం, 'చెంచా' ఓ హోటల్ నుంచి బైటికి వస్తుంటే... చిన్న చక్రాల బండి మీద దేక్కుంటూ ఓ ముష్టివాడు వచ్చి... 'అయ్యా... బాబూ .. ధర్మం..' అంటూ బొచ్చె ఎత్తి అడుక్కోసాగాడు. భూషణం చిరాకుపడుతూనే రూపాయి బిళ్ళ తీసి బొచ్చెలో వేయబోతుండగా ఓ చిత్రం జరిగింది. అంతవరకూ చెవి కోసిన మేకలా అరిచిన ఆ బిచ్చగాడు చటుక్కున తల తిప్పుకుని వాళ్ళకి దూరంగా బండి తోసుకుంటూ వెళ్ళడం కనిపించి భూషణం ఆశ్చర్యపోయాడు. ఇంతలో 'కుంటి పాండూ!' అంటూ క్షణంలో రేప్ కాబోతున్న హీరోయిన్‌లా అరిచాడు 'చెంచా'. భూషణం యథావిధి మరోసారి ఆశ్చర్యపోయి చూస్తుండగా... సరిగ్గా అప్పుడే అటుగా వస్తున్న ఓ గుడుంబా లారీకింద కుంటి పాండు గజ్జి కుక్కలా దారుణంగా చచ్చిపోబోతుండగా 'చెంచా' ఒడుపుగా పాండుని రక్షించి మున్సిపాలిటీ వాళ్ళకి శ్రమ తగ్గించాడు.

బండి తోసే, సాటి కుష్టువాడిలా 'చెంచా' ముష్టి పాండుని ఓ మూలకి తీసుకెళ్ళాడు. ఒకరిద్దరు... రూపాయి.. అర్ధా చెంచా తిలో పెట్టడం చూసి భూషణం ముసిముసిగా వ్వుకున్నాడు. సిగరెట్ వెలిగించి, అగ్గిపుల్ల విసిరేం బోతున్న భూషణాన్ని ఎగాదిగా చూసి 'ఏం చెయ్యి చినవాడివి... అమ్మా ధర్మం... అనడానికి నామోషీనా?' అని సణుగుతూనే రెండు రూపాయల బిళ్ళ భూషణం చేతిలో పెట్టిందో భక్త శబరి. భూషణం కొయ్యబారిపోవడం చూసి 'చెంచా' అదే పనిగా నవ్వసాగాడు.

కానీ, పాండు జరుగుతున్న తమాషా గమనించే స్థితిలో లేడు. వెక్కివెక్కి ఏడుస్తున్నాడు. ఒంట్లో నీళ్ళన్నీ అయిపోయి పాండు డీహైడ్రేషన్‌తో మరో నాలుగు సెకండ్లలో పోతాడనగా, చచ్చినట్టు 'ఏం జరిగింది పాండు?' అన్నాడు చెంచా.

'ఓరోజు ఆ ధూమేష్ గాడికి వార్నింగ్ ఇద్దామని వాడింటికి పోయినా... నేను నోరు తెరవకముందే వాడూ.. వాడి దోస్తులూ నా వెంటబడ్డారు. సుత్తి బరువుకి నేను కిందపడిపోయిన. అంతే ఆ బద్మాష్‌గాళ్ళు నా కాళ్ళ మీద నుంచి ఆటోలు తీస్కపోయి నుజ్జు నుజ్జు చేసిన్రు... పనికిరావని నా రెండు కాళ్ళూ తీసేసిన్రు దవాఖానాల. అప్పటిసంది నేను ... గిట్ల..' అంటూ మళ్ళీ ఫౌంటెన్ల లాంటి కళ్ళకి పని చెప్పాడు కుంటి పాండు.

భూషణం నిట్టూర్చి 'పోన్లే పాండు... మా పని జరగకపోయినా నీ ప్రయత్నం వృధాపోలేదు. కనీసం నీ నేమ్ బోర్డుకి సార్థకత లభించింది. మే గాడ్ బ్లెస్ యూ' అని దీవించి తనకొచ్చిన 'కలెక్షన్' పాండు బొచ్చెలో వేశాడు... చెంచా కూడా డిటోనే చేశాడు.

రెండు రోజుల్లో కవిత పెళ్ళి.. ఏ క్షణంలోనైనా హార్ట్ ఎటాక్ రావచ్చు అన్నట్టు వుంది భూషణం పరిస్థితి.

అప్పుడు, చెంచా, చాలాకాలం క్రితం శ్రీకృష్ణపరమాత్మ, అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్న అర్జునుడి వైపు చూసినట్టు చూసి, గీతోపదేశం లాంటిదే ఏదో భూషణానికి చేశాడు. మరుక్షణం భూషణం, అది పబ్లిక్ రోడ్డు అని కూడా మరిచిపోయి సూమో రెజ్లర్‌లా చెంచాని వాటేసుకుని, ముద్దుపెట్టుకున్నాడు. అటుగా వెళుతున్న ఆడంగులు ఒకరిద్దరు అది చూసి మొహం వికృతంగా పెట్టి ధూ! అని ఉమ్మడం కనిపించింది... అయినా ఏం ఫర్వాలేదు.

తెల్లారితే తన పెళ్ళి అని తెలిసీ, భూషణం నిమ్మకు నీరెత్తినట్టు... పైగా ఎంతో కొంత ఆనందంగా కూడా కన్పిస్తుండడం గమనించి కవితకి ఆశ్చర్యంతో పాటు అనుమానం కూడా కలిగింది. అయినా ఎలాగో తనను తాను సమాధానపరచుకుంది.

మరో గంటలో పెళ్ళి ముహూర్తం సమీపిస్తుందనగా.. అప్పుడు ప్రయోగించాడు నాగభూషణం బ్రహ్మాస్త్రాన్ని! ధూమేష్ అప్పటికే పెళ్ళి మండపంలో కొచ్చాడు.

ఇంతలో.. అందరూ ఆశ్చర్యంగా చూస్తుండగా.. బాజాభజంత్రీలతో.. పెళ్ళిబట్టలు.. పూలదండలతో నాగభూషణం అతని ప్రక్కనే పెళ్ళికూతురి గెటప్‌లో ఓ స్త్రీ, మంటపం దగ్గరికి వచ్చారు. కవిత.. ధూమేష్ నోరెళ్ళబెట్టారు.

''రేయ్.. ధూమేష్.. కుదిరిందా.. నీ తిక్క... నేను ఆనాడే చెప్పాను– మీ పెళ్ళి జరగదని. ఎట్టి పరిస్థితుల్లోనూ అది జరగకూడదనే నేను నీకు దిమ్మతిరిగే పథకం వేశాను. ఈమెను పోల్చుకున్నావా? అవున్రా. అమ్మే! సాక్షాత్తు మీ అమ్మే!! ఇప్పుడు నా భార్య! ఆరకంగా నీకు కవిత ఏమవుతుందో విడమర్చి నేను చెప్పాల్సిన పనిలేదనుకుంటా... ఐ యామ్ సారీ కవితా... నాకు మరో మార్గం లేకపోయింది. ఏదిఏమైనా చివరికి గెలుపు నాదే!'' చిద్విలాసంగా నవ్వుతూ మోసం మెలేశాడు భూషణం.

ఉన్నట్టుండి.. ధూమేష్... కవిత పగలబడి నవ్వసాగారు. భూషణం అయోమయంగా చూస్తుండిపోయాడు.

''అరే పాగల్ మామా! గెలిచింది నువ్వు కాదు... మేమే.. నువ్వు పెండ్లి చేసుకున్నది మా అమ్మను కాదు...'' అంటూ ఆగాడు ధూమేష్.

''నిజమే, అయ్యగారు... ఐ మీన్.. బావగారూ. ఈమె మా అక్కయ్య.. ఒకప్పుడు ప్రేమలో ఓడిపోయిన నేను... కవితమ్మ గారి ప్రేమని గెలిపించాలనుకున్నాను. అదీకాక పెద్దమ్మగారు పోయాక మీరు ఒంటరి అయిపోయి మెంటల్‌గా తయారయ్యారు. ఏజ్ బార్ అయి.. పెళ్ళికాక రోజురోజుకూ మెంటల్‌గా మారిపోతున్న మా అక్కయ్యే మీకు సరి అయిన జోడు అని, అటు కవిత ప్రేమా, మా అక్క పెళ్ళి... ఇలా ఒకే దెబ్బకు...'' చెంచా ఆగిపోయాడు. అప్పటికే భూషణం కోమాలోకి వెళ్ళిపోయాడు.

■